క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: మండలంలోని ఇగుడూరు గ్రామ సమీపంలో ఉన్న గంగాభవానీ ఆలయంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి 5,40,330 ఆదాయం వచ్చిందని ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భోగేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.96 వేలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో గురువారం హుండీల్లోని కానుకలను లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.మురళీధర్‌గుప్త ఆధ్వర్యంలో గార్లదిన్నె గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి బి బాబు, పామిడి ఈఓ ఏ క్రిష్ణయ్య సమక్షంలో హుండీ కానుకలను అర్చకులు, కమిటీ సభ్యులు దేవగుడి రామేశ్వరశర్మ, చంద్రాశర్మ, భక్తులు లెక్కించారు. 2023, డిసెంబర్ 20 నుంచి 2024మార్చి 21 వరకూ రూ.96,666 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

26న 'కోటంక'లో హుండీ కానుకల లెక్కింపు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ అధికారుల సమ క్షంలో శాశ్వత హుండీల్లోని కానులకు లెక్కించనున్నట్లు ఈఓ బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మాఘమాసంలో భక్తులు స్వామి హుండీలో సమర్పిం చిన కానుకలు లెక్కింపులో పాల్గొనే వారు హిందూ సంప్రదాయ దుస్తులు ధరించి హాజరు కావాలన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి వెన్నెల శ్రీను

శింగనమల/పుట్లూరు: ప్రశాంతం ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి వెన్నెల శ్రీను తెలిపారు. గురువారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16న సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఏప్రిల్ 18న గెజిటెడ్ నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. నామినేషన్లు ఏప్రిల్ 25 వరకూ ఉంటాయని, స్క్రూటినీ ఏప్రిల్ 26న ఉంటుందన్నారు. మే 13 పోలింగ్ జరుగుతుందన్నారు. కౌంటింగ్ జూన్ 4 న ఉంటుందన్నారు. జూన్ 6న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. నామినేషన్లు శింగనమలలోని తహసీల్దార్ కార్యాలయంలో స్వీకరిస్తామన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికలు సజావుగా కొనసాగేందుకు సహకరించాలన్నారు. ఏప్రిల్ 15 వరకూ ఓటు నమోదుకు అవకాశం ఉందన్నారు. తహసీల్దార్ శోభన్‌బాబు, డిప్యూటీ కలెక్టర్ ప్రకాష్‌రావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓలు, నోడల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని శింగనమల ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీను సూచించారు. గురువారం ఆయన మండలంలోని కడవకల్లు గ్రామంలో స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ దస్తగిరి, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని ముస్లింల ప్రచారం



ప్రచారం చేస్తున్న ముస్లిం నాయకులు

తాడిపత్రిరూరల్: వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పట్టణంలోని ముస్లిం నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. పట్టణంలో ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై వారు ఫోకస్ పెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వారు కరపత్రాలను అందిస్తున్నారు. ప్రచారానికి అపూర్వ స్పందన వస్తోందని ముస్లిం నాయకులు తెలిపారు.

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

- చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, పైలా నరసింహయ్య, గిరిజమ్మ, మంజుల

బుక్కరాయసముద్రం: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి రావాలని చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని, ప్రజలు ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీ, గిరి ప్రసాద్ నగర్, భాగ్య నగర్ కాలనీలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, నాయకులతో కలసి ఆయన పర్యటించారు. కాలనీల్లో ఉన్న ప్రజలను పలకరిస్తూ సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. ముందుగా ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులుకు కాలనీవాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలతో టపాసులు పేలుస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అందించారన్నారు. చంద్రబాబు నాయుడు కుట్రలు చేస్తూ అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. తప్పుడు వాగ్దానాలు ఇచ్చిన చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే పట్టం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ప్రజానీకం పట్టం కట్టబోతున్నారన్నారు. జగనన్న పేదలకు ప్రవేశ పెట్టిన పథకాలే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. చంద్రబాబు తలకిందులు తపస్సు చేసినా...ఎంత మందితో జత కట్టినా వచ్చే ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడం ఖాయమన్నారు. చంద్రబాబు చెప్పే మోసపూరిత వగ్దానాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. జగనన్న ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి శంకర్ నారాయణను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అంకే నరేష్, సర్పంచు పార్వతి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, ఎంపీటీసీ సుజాత, నాయకులు ఆలూరు రమణారెడ్డి, పూల నారాయణస్వామి, లక్ష్మీరెడ్డి, చికెన్ నారాయణస్వామి, మహానందరెడ్డి, పుల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రమోహన్, బుల్లే రాజా, వరి కూటి కాటమయ్య, సాకే లక్ష్మీ నారాయణ, అంజి, లచ్చి, రామ్మోహన్‌రెడ్డి, సాయి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, పైలా, గిరిజమ్మ

చంద్రబాబువి బూటకపు హామీలు



తాడిపత్రి మండలం వంగనూరు గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- బాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: చంద్రబాబు బూటకపు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మండలంలోని వంగనూరు, బొందలదిన్నె, కొండేపల్లి, వీరాపురం గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. గ్రామస్తులతో మమేకమై వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ చంద్రబాబు అమలు కాని హామీలిచ్చి ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నాడన్నారు. గతంలో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా సరిగా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిన సంగతి అందరికీ తెలిసిందే అన్నారు. రైతులకు రుణమాఫీ, అక్కచెల్లెమ్మలకు డ్వాక్రా రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం అని చెప్పి మోసం చేశాడని గుర్తు చేశారు. వైఎస్సార్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే తెచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని గ్రామస్తులను ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఓబులరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, బుజ్జి, పుల్లారెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, జనార్దన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అరుణ, సూర్యనారాయణరెడ్డి, భాస్కర్‌నాయుడు, చంద్రమౌళి, జీవయ్య తదితరులు పాల్గొన్నారు.



చిత్రచేడులో మాజీ ఎంపీపీ రఘునాథరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా...

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిత్రచేడు , మొళకతాళ్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న మాజీ ఎంపీపీ రఘునాథరెడ్డిని ఆయన పరామర్శించారు. ఆరోగ్య స్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకరావాలని భరోసా ఇచ్చారు. అనంతరం మొళకతాళ్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పుల్లారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటానని కుటుంబసభ్యులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు గూడూరు సూర్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, దేవమోహన్, కమలాకర్‌రెడ్డి ,రంగారెడ్డి, కృష్ణారెడ్డి, క్రిష్టిపాడు బాషా తదితరులు పాల్గొన్నారు.

తాతార్యారూఢ స్వామికి ప్రత్యేక పూజలు



తాతయ్య స్వామిని దర్శించుకుంటున్న ఆలూరు సాంబశివారెడ్డి, వీరాంజనేయులు

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో గురువారం రెండోరోజు తాతార్యారూఢ స్వామి తిరునాల్లో భాగంగా ప్రధాన అర్చకులు మూలవిరాట్‌ను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ గంగ పూజ, కలశ స్థాపన, రుద్రయజ్ఞం చేశారు. స్వామికి ఆలయ ధర్మకర్త ఆదినారాయణ పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు.సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి సమయంలో సహస్ర బిల్వార్చన, పూర్ణాహుతి, కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. రాత్రికి స్వామి పుష్పరథోత్సవం నిర్వహించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనే యులు తాతయ్యస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్య క్రమంలో మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, నాయకులు తాతిరెడ్డి, ఓబులపతి, యుగంధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

పెద్దపప్పూరు: మండలంలోని దేవుని ఉప్పలపాడు, తురకపల్లి, పెద్ద ఎక్కలూరు తదితర ఫ్యాక్షన్ గ్రామాల్లో సీఐ రోషన్,ఎ స్‌ఐ శరత్ చంద్ర ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ దళాలు కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతారణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన



డ్రైనేజీ కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 5 ,6,16వ వార్డుల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన డ్రై నేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యపై ఆరా తీశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు, వాటర్ వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

పెద్దవడుగూరు: శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని రెవెన్యూ అధికారులు, పోలీసులు సూచించారు. వివరాలు.. గార్లదిన్నె మండలంలోని ఇల్లూరు సమీపంలో సర్వే నెంబర్ 1లో ఇసుక రీచ్‌కు ప్రభుత్వం 2023 నవంబర్‌లో దాడిశెట్టి రామకృష్ణకు అనుమతి జారీ చేసింది. ఇటీవల రీచ్ నిర్వాహకులు ఇసుకను తరలించడానికి చర్యలు చేపట్టారు. పెద్దవడుగూరు మండలంలో కొండూరు గ్రామ సమీపంలోని పామిడికి వెళ్లే రహదారిపై భారీ వాహనాలు వెళ్తే రోడ్డు నాశనం అవుతుందని పచ్చనేతలు కొండూరు గ్రామస్తులను ఉసిగొల్పారు. దీంతో గ్రామస్తులు, కొందరు టీడీపీ కార్యకర్తలు ఇసుకను తరలిస్తే రోడ్లు శిథిలం అవుతాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గురువారం పెద్దవడుగూరు తహసీల్దార్ శేషారామ్‌సింగ్, యాడికి సీఐ రోషన్, శింగనమల సీఐ శ్రీధర్, పెద్దవడుగూరు ఎస్‌ఐ శ్రీనివాసులు, గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్‌బాషా తదితరులు పెన్నానదిలోని రీచ్ ఏరియాలో పర్యటించారు. అనంతరం ఇసుక తరలింపునకు అడ్డుపడుతున్న కొందరు గ్రామస్తులు, పచ్చనేతలతో అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన తరువాత ఎవరూ అడ్డుచెప్పడానికి వీలులేదని పోలీసులు సూచించారు. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో శాంతిభద్రతలకు భంగం కలిగించే పనులు చేస్తే సహించబోమని హెచ్చరించారు. రెండు రోజుల వ్యవధి ఇస్తే గ్రామస్తులతో మాట్లాడతామని, అంత వరకూ పనులు ఆపాలని పచ్చ నాయకులు కోరారు. దీంతో అధికారులు సరేనంటూ సర్దిచెప్పి పంపారు.

ఎస్‌ఆర్‌ఐటీలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ (డేటా సైన్స్) ఆధ్వర్యంలో గురువారం ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ఇందులో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. అవి సమాజానికి ఏవిధంగా ఉపయోగపడతాయో విద్యార్థులు వివరించారు. రాబోయే కాలం ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అనేది మానవాళి జీవన విధానాన్ని మారుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బాలక్రిష్ణ, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐక్యూఏసీ డైరెక్టర్ చైతన్య కిషోర్, సీఎస్‌డీ హెచ్‌ఓడీ డాక్టర్ చిత్ర లింగప్ప, ఈఎస్‌ఈ హెచ్‌ఓడీ వీరప్రకాష్, ఏఎల్ అండ్ ఎంఎల్ హెచ్‌ఓడీ డాక్టర్ హేమంత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ర్యాలీలు, సభలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

గుంతకల్లు: రాజకీయ పార్టీ నాయకులు ర్యాలీలు, సభలు, ఆడియో, వీడియో సందేశాలు ఇతర్రత కార్యక్రమాల నిర్వహణకు 48 గంటల ముందే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఆర్డీఓ వాకా శ్రీనివాసులురెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో ఎన్నికల నియావళిని అనుసరించి ప్రచారం చేపట్టాలన్నారు. ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన దృష్ట్యా ఫారం 7, 8 స్వీకరించడం నిలిపేశామని, నామినేషన్లు స్వీకరించే చివరి రోజు (ఏప్రిల్ 25) వరకు ఫారం–6ను (కొత్త ఓటర్ల చేర్పు) స్వీకరిస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియామావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్–ఎంసీసీ) అమలు చేయడానికి నియోజకవర్గ వ్యాప్తంగా ముగ్గురు ఎంపీడీఓలు, ఇద్దరు కమిషనర్లు నియమించామన్నారు. అలాగే తొమ్మిది టీమ్‌ల ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు షిఫ్టుల్లో పనిచేస్తుంటారన్నారు. వీరు ఓటర్లకు డబ్బు, వస్తువులు, ఇతర వాటిని ఆశ చూపి ప్రేరేపించే వక్తులను గుర్తించి పోలీసులకు అప్పగిస్తారన్నారు. నియోజవకర్గ వ్యాప్తంగా 29 రూట్లలో 29 సెక్టార్ ఆఫీసర్లు, 29 సెక్టార్ పోలీసు అఫీసర్లు ఉంటారన్నారు. నియోజవర్గ వ్యాప్తంగా ఐదు మోడల్ పోలింగ్ బూత్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో ఒక పోలింగ్ బూత్‌లో సిబ్బంది మొత్తం మహిళలను, మరో పోలింగ్ బూత్‌లో 25 ఏళ్లలోపు యువతను సిబ్బందిగా నియమించి ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తామన్నారు. మరో మూడు పోలింగ్ బూత్‌ల్లో మౌలిక వసతులు కల్పన, బాలింతలు, వృద్ధులు ఓటింగ్‌కు వచ్చినప్పుడు సహాయపడే విధానంపై వివరిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో 85 ఏళ్లపైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు వేసే సౌకర్యం కల్పిస్తామన్నారు. నియోజవకర్గ వ్యాప్తంగా 85 ఏళ్ల పైబడిన ఓటర్లు 1,197 మంది, దివ్యాంగులు 2,670 మందిని గుర్తించామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. గుంతకల్లు నియోజవర్గ వ్యాప్తంగా దాదాపు 108 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గుర్తించామన్నారు. ఎన్నికల నియామావళి ఉల్లంఘనతోపాటు ఇతర కార్యకలాపాలకు పాల్పడినట్లు మీ దృష్టికి వస్తే కంట్రోల్ నం.08552 223355 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శేషఫణి (గుంతకల్లు), భారతి (గుత్తి), చంద్రశేఖర్‌నాయక్ (పామిడి) ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఆదినారాయణ పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని భాగ్య నగర్ కాలనీలో తల్లిదండ్రులు లేని అనాథ యువతి పద్మావతి వివాహానికి సహాయం చేయాలని కాలనీ వాసులవిజ్ఞప్తి మేరకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆలూరు రమణారెడ్డి గురువారం రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుల్లే రాజా, శేషానందరెడ్డి, అంజి, లచ్చి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే పెద్దారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రిరూరల్: స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే పెద్దారెడ్డిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకట అనిల్‌కుమార్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంపిక చేయడానికి సహకారం అందించిన ఎమ్మెల్యే పెద్దారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రూపాయి డాక్టర్‌గా తాడిపత్రి ప్రాంత ప్రజలకు చేరువైన తనకు ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే పెద్దారెడ్డి గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

సంక్షేమ పాలన చూసి ఓటెయ్యండి



ఎన్నికల ప్రచారం నిర్వ హిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

యాడికి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనను చూసి వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని కూర్మాజీపేట, పచ్చారుమేకల పల్లె గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకతీతంగా ఇంటింటికీ లబ్ధి చేకూర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిరుపేదల గుండెల్లో కొలువై ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని, సీఎంగా జగనన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, భోగతి బ్రహ్మానందరెడ్డి, రాయలచెరువు ఉప సర్పంచు ప్రవీణ్‌కుమార్ యాదవ్, నాగేష్, యాడికి సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, గంగరాజు, జిలాన్, ఉపేంద్రగౌడ్, రవికాంత్ చౌదరి, శివయ్య, చిన్న వెంకట నాయుడు, రవితేజ, ఆది, నాగరాజు, రాగుల వెంకటరామిరెడ్డి, శివకేశవ రెడ్డి, నాగరాజు, జలదుర్గం రామాంజనేయులు, సచివాలయాల మండల కన్వీనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



తురకపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి

పెద్దపప్పూరు: జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని తురకపల్లిలో గురువారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు సాయిప్రతాప్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ్‌రెడ్డి, ఎంపీపీ వెంకటరామిరెడ్డి, జిల్లా పార్లమెంట్ జనరల్ సెక్రటరీ రవిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు హాజీ వలి, నాయకులు శివారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మోమినాబాద్‌లో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న బోయ రామాంజనేయులు అనే వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు. నిందితుడి నుంచి 14 టెట్రా ప్యాకెట్లను (90 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నామన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపటి నుంచి 'వార్డుల్లో మేమంతా సిద్ధం' సమావేశాలు

గుంతకల్లుటౌన్: వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తోంది. అందులో భాగంగా ఎన్నికలకు పార్టీశ్రేణులను సమాయత్తం చేయడానికి ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నుంచి పట్టణంలో ఎన్నికల సమరానికి 'మేమంతా సిద్ధం' సమావేశాలను నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప తెలిపారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు 11, 12 వార్డులు, 11:30 గంటలకు 13, 14 వార్డులు, సాయంత్రం 4 గంటలకు 5, 6 వార్డులకు చెందిన పార్టీ ముఖ్యనేతలు, పోలింగ్ బూత్ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. పార్టీశ్రేణులు హాజరు కావాలన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

గార్లదిన్నె: మండల కేంద్రంలోని శింగనమల క్రాస్ సమీపంలో ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. శింగనమల మండలం వెస్ట్ నరసాపురానికి చెందిన సంజీవ్ కుమార్(35)అనే వ్యక్తి గ్రామంలో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మూడేళ్లుగా వేరుశనగ, ఆముదం తదితర పంటలు సాగు చేసేవాడు. పంటల పెట్టుబడి కోసం ఇతర వ్యక్తుల వద్ద అప్పు చేశాడు. పంట దిగుబడి రాక, అప్పులు తీర్చే మార్గం లేక శింగన మల క్రాస్ సమీపంలో చెరువుకు వెళ్లే దారిలో పురుగుమందు తాగాడు. అపస్మారకస్థితిలో పడి ఉండగా స్థానికులు గమనించి బంధువులకు సమాచారమిచ్చారు. అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అతడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో వైఎస్సార్‌సీపీ ఐటి వింగ్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు అనంతపురం రోడ్డులోని అన్ని షాపుల ఎదుట మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు రాయలసీమ విమోచన సమితి సభ్యులు హరనాథ్ రెడ్డి, కోటేశ్వరరావు, ఉమాకాంత్ రెడ్డి, మోహన్, సుధాకర్, జానకిరెడ్డి, తేజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులో గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్ డివైడర్‌ను ఢీ కొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. చీరాలకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి రెండు రోజుల క్రితం గుత్తిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. గురువారం బైక్‌లో బస్టాండ్ వైపు వెళ్తుండగా కర్నూలు రోడ్డులోని బిశ్వాస్ క్లినిక్ వద్ద అదుపు తప్పి బైక్ డివైడర్‌ను ఢీ కొనింది. ప్రమాదంలో వెంకటేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోరకు అనంతపురం తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని కొత్తపేట, కమాటం వీధి అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సీడీపీఓ ఢిల్లీశ్వరి, మోడల్ ఫౌండేషన్ సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని రికార్డులు, పౌష్టికాహారం నిల్వలను పరిశీలించారు. సమయపాలన పాటించాలని అంగన్వాడీ కార్యకర్తలను ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.